సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



రాజన్నకు భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్నను గురువారం 10వేల మంది భక్తులు దర్శించుకున్నారు. బద్ది పోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు.



పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్లఎడ్యుకేషన్: ఖమ్మం జిల్లాలో ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించే విద్య, వైజ్ఞానిక మహాసభల పోస్టర్‌ను సిరిసిల్లలో టీపీటీఎఫ్ నాయకులు గురువారం ఆవిష్కరించారు.

గరిష్టం/కనిష్టం
33.0/19.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సహకార రైతులకు బీమా

- టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



బీమా చెక్కు అందిస్తున్న రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): హకార రైతులకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు తెలిపారు. బీమా పొందిన రైతులు మరణిస్తే వారి కుటుంబానికి ఆసరాగా రూ.2 క్షల బీమా సొమ్ము అందిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని గజసింగవరం గ్రామానికి చెందిన మహిళా రైతు చల్ల నర్సవ్వ చనిపోవడంతో ఆమె భర్త నర్సయ్యకు ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన కింద రూ.2లక్షల బీమా చెక్కును గురువారం అందించారు. కేడీసీబీ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో రాజిరెడ్డి, సెస్ డైరెక్టర్ గొరిటేని నారాయణరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ గోగు లింగం యాదవ్, సింగిల్‌విండో మేనేజర్ సత్యంరావు, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు పెద్దవేని వెంకటి యాదవ్, మాజీ ఎంపీటీసీ ఎగదండి స్వామి, నాయకులు ధన్‌రాజ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

బీజేపీకి కౌన్సిలర్ రాజీనామా



వేములవాడ: వేములవాడ మున్సిపల్ 15వ వార్డు కౌన్సిలర్ కవితారెడ్డి తిరుమల్‌రెడ్డి బీజేపీకి రాజీనామా చేస్తూ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణకు గురువారం లేఖ పంపించారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. త్వరలోనే కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. అయితే మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక ఈనెల 12న జరగనున్న నేపథ్యంలో కవితారెడ్డి తిరుమల్‌రెడ్డి రాజీనామా చర్చనీయాంశమైంది.

ధర్మగుండం పరిశుభ్రం



సాక్షి ఎఫెక్ట్..

వేములవాడ: రాజన్న ఆలయ ధర్మగుండం అపరిశుభ్రంగా మారి దుర్వాసన వస్తుండడంతో ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆలయ అధికారులు ధర్మగుండంలోని మురికినీటిని ఖాళీ చేయించి స్వచ్ఛమైన గోదావరి జలాలను నింపారు.

ప్రతీ నియోజకవర్గానికి రూ.10 కోట్లు

సాక్షి,పెద్దపల్లి: ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.10 కోట్ల స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆమోదంతో అభివృద్ధి పనులు చేపట్టాలని సదరు జీవోలో పేర్కొంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాలకుగాను ఒక్కోదానికి రూ.10 కోట్ల చొప్పున మొత్తం 130 కోట్లు మంజూరు చేసింది. ఇందులో ప్రతీ అసెంబ్లీ పరిధిలో రూ.2 కోట్లు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం, రూ.కోటి మంచి నీటి వసతి కల్పించేందుకు, ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ ఖర్చులకు రూ.50 లక్షలు ఖర్చు చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

అలరించిన ఫేర్‌వెల్ డే




తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ఫేర్‌వెల్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథి వరంగల్, కరీంనగర్ ఆర్సీవో డీఎస్ వెంకన్న మాట్లాడుతూ విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ రజినీ, వైస్ ప్రిన్సిపాల్ సుధాసింధు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉత్కంఠగా క్రికెట్ పోటీలు

సిరిసిల్లక్రైం: జిల్లాలోని పోలీసులకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు గురువారం ఉత్కంఠభరితంగా సాగాయి. ఫైనల్ మ్యాచ్‌లో డీజీ బ్రేవ్ సోల్జర్స్, సిరిసిల్ల స్ట్రైకర్స్ తలపడగా.. బ్రేవ్‌సోల్జర్స్ జట్టు విజేతగా నిలిచింది. విజేత, రన్నరప్ జట్లకు ఎస్పీ అఖిల్‌మహాజన్ బహుమతులు అందించారు.

- వివరాలు IIలో▸



పక్షుల సందడి

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటలోని చెరువుల్లో కొత్తరకం పక్షులు సందడి చేస్తున్నాయి. ఇటీవల ఈ పక్షుల రాక పెరగడంతో చెరువులకు అందం వచ్చింది. అదే సమయంలో పంట పొలాల్లోకి చేరి పురుగులు చంపుకుని తినే క్రమంలో వరినాట్లను పాడుచేస్తున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జాగ్రత్తగా నడపండి

వేములవాడ: వాహనాలను జాగ్రత్తగా నడపుతూ.. క్షేమంగా గమ్యం చేరాలని వేములవాడ పోలీసులు వినూత్నంగా ప్రయత్నించారు. హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాలు నడుపుతున్న వారికి వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో గురువారం గులాబీ పూలు ఇచ్చి అభినందనలు తెలిపారు. ఎస్సై దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

యువర్ అటెన్షన్ ప్లీజ్..

రైల్వేకు పెద్దపీట

ఉమ్మడి జిల్లాకు రూ.673.43 కోట్లు



- గతేడాది రూ.647 కోట్లు
- మనోహరాబాద్–కొత్తపల్లికి రూ.350 కోట్లు
- కాజీపేట–బల్లార్షా మూడోలైన్‌కు రూ.300 కోట్లు
- మణుగూరు–రామగుండం కోల్‌కారిడార్ లైన్‌కు రూ.5 కోట్లు
- ఊసేలేని తిరుపతికి అదనపు సర్వీసులు
- పెద్దపల్లి–నిజామాబాద్ డబ్లింగ్‌కు కలగని మోక్షం

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

కేంద్రం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం పెరిగింది. గతేడాది కేటాయించిన రూ.647 కోట్ల కంటే స్వల్పంగా పెంచింది. రూ.673.43 కోట్లు కేటాయించింది. కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్‌కు పెద్దపీట వేసింది. గతేడాది రూ.185 కోట్లు కేటా యించగా ఈసారి ఏకంగా రూ.350 కోట్లు కేటాయించడం, కాజీపేట–బల్లార్షా మూడోలైన్ కోసం రూ.300 కోట్లు ఇస్తామని ప్రకటించడం విశేషం.

కొత్తపల్లి–మనోహరాబాద్‌కు రూ.350 కోట్లు

ఉమ్మడి జిల్లా వాసులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టు కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్ పనుల కోసం కేంద్రం రూ.350 కోట్లు కేటాయించింది. ఇందులో రాష్ట్ర వాటాగా రూ.112 కోట్ల వరకు వెచ్చించాలి. గతేడాది రూ.185 కోట్లను మాత్రమే కేటాయించడం గమనార్హం. ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని 2016లో కేంద్రాన్ని ఒప్పించింది. రూ.1,167 అంచనా వ్యయంతో ప్రారంభించి ఇప్పటి వరకూ మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు లైన్ పూయి, రైలుసేవలు అందుబాటులోకి వచ్చాయి. మొత్తం 151 కిలోమీటర్ల పొడవైన ఈ మార్గం ఇప్పటి వరకూ 75 కి.మీ పూర్తయింది. ప్రస్తుతం సిరిసిల్ల–సిద్దిపేట(37 కి.మీ) భూసేకరణలో కొన్ని ఇబ్బందులు ఎదురైనా ఈ నిధులతో సమసిపోనున్నాయి.

ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల కేటాయింపులు ఇలా..

కొత్తపల్లి– మనోహరాబాద్ (148.9 కిమీ)	రూ.350 కోట్లు
కాజీపేట– బల్లార్షా మూడోలైన్	రూ.300 కోట్లు
బల్లార్షా–రామగుండం ఎలక్ట్రిక్ అప్‌గ్రేడేషన్	రూ.18.43 కోట్లు
మణుగూరు–రామగుండం (200 కి.మీ)	రూ.5 కోట్లు
మందమర్రి–రాఘవాపురం	రూ.5 లక్షలు
రాఘవాపురం–రామగుండం (ఆర్వోబీ)	రూ.10,000
పెద్దపల్లి–కరీంనగర్–నిజామాబాద్ (177 కి.మీ)	రూ.1000
పెద్దపల్లి బైపాస్–కరీంనగర్ లైన్ (2.169 కి.మీ)	
కనెక్ట్ బల్లార్షా– కాజీపేట మెయిన్‌లైన్	రూ.1000
కొలనూరు– పెద్దపల్లి–ఆర్వోబీ	రూ.10,000

కాజీపేట–బల్లార్షా మూడోలైన్ రూ.300 కోట్లు

కాజీపేట–బల్లార్షా మూడోలైన్‌కు రూ.300 కోట్లు కేటాయించింది. గతేడాది రూ.450 కోట్లు కేటాయించిన కేంద్రం ఈసారి పనులు పూర్తవుతున్న నేపథ్యంలో రూ.300 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే ఈ మార్గంలో మూడు లైన్లలోనూ రైళ్లు తిరుగుతుండడం విశేషం.

రామగుండం–మణుగూరుకు రూ.5 కోట్లే

కోల్‌కారిడార్‌గా పిలుస్తోన్న రామగుండం(రాఘవాపురం)–మణుగూరు రైల్వేలైన్‌కు ఈసారి నిధులు తగ్గాయి. రామగుండం– మణుగూరు మధ్య ప్రస్తుతం ఉన్న 290 కి.మీలను 200 కి.మీలకు తగ్గించేందుకు భూపాల్లి మీదుగా వేస్తున్న ఈలైన్ అంచనా విలువ రూ.3వేల కోట్లు. 2022 డిసెంబరులో ఈ మార్గానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఎంతో ఆర్థిక ప్రాముఖ్యత ఉన్న ఈలైన్‌కు ఇంత తక్కువ కేటాయించడం తీవ్ర నిరాశకు గురిచేసింది.

పెద్దపల్లి బైపాస్‌కు..

పెద్దపల్లి–కరీంనగర్ మార్గాన్ని కాజీపేట–బల్లార్షా మార్గంతో కలుపుతున్న పెద్దపల్లి బైపాస్‌లైన్‌కు రూ.1000 కేటాయించారు. ఈ మార్గంలో పనులు వేగిరమైనప్పటికీ భూసేకరణ, స్టేషన్ నిర్మాణ పనులు ఇప్పటికే ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో రూ.1000 కేటాయించడం గమనార్హం.

ఊసేలేనివి ఇవే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిమాండ్ ఉన్న కరీంనగర్–తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సర్వీసుల పెంపుపై కేంద్రం ఎలాంటి ప్రకటన చేయకపోవడం నిరాశకు గురిచేసింది. వాస్తవానికి ఈ రైళ్లలో కోచ్‌లు సరిపోక కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, మంచిర్యాల, మందమర్రి నుంచి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దపల్లి–నిజామాబాద్ డబ్లింగ్ పనులకు బడ్జెట్‌లో చోటు దక్కకపోవడం గమనార్హం.

ఉత్తుత్తి బడ్జెట్



కేంద్రం బడ్జెట్ కేటాయింపులు అంతా ఎన్నికల జిమ్మిక్. ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక కేటాయింపులు లేవు. కాంగ్రెస్ హయాంలో నేను తెచ్చిన తిరుపతి రైలు కనీసం సర్వీసులు కూడా పెంచలేదు. మణుగూరు – రామగుండం కోల్ కారిడార్ కు రూ. 5 కోట్లు ఇవ్వడం ఏంటి? ఇలా అయితే ఈ ప్రాజెక్టులు ఎన్నడు పూర్తవుతాయి? ఇదంతా ఉత్తుత్తి బడ్జెట్.

– పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి

త్వరలో తిరుపతి రైళ్లపై..



గతేడాది కంటే ఈసారి దాదాపు రూ.30 కోట్ల బడ్జెట్ పెరిగింది. ఉమ్మడి జిల్లాకు కేంద్రం ఇస్తున్న ప్రాధాన్యానికి ఇది నిదర్శనం. తిరుపతి రైళ్ల విషయంలో త్వరలో ప్రకటన చేయిస్తాం. అమృత్ పథకం కింద కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం స్టేషన్లను ఆధునీకీకరిస్తున్నాం. జిల్లాకు నిధులు పెంచడంలో కీలకంగా వ్యవహరించిన రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు కృతజ్ఞతలు.

– బండి సంజయ్, ఎంపీ

అందుబాటులోకి తేవాలి



మనోహరాబాద్–కొత్తపల్లి పనులను నేను ఎంపీగా ఉన్న సమయంలో ప్రారంభించాం. ఈసారి రూ.350 కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాం. ఉమ్మడి జిల్లా వాసులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్టును మేం సిద్దిపేట వరకు తీసుకొచ్చాం. ఒప్పందం ప్రకారం 2025 డిసెంబరు నాటికి కరీంనగర్ వరకు అందుబాటులోకి తేవాలి.

– వినోద్, మాజీ ఎంపీ

పల్లెల్లో ప్రత్యేకాధికారులు

- ముగిసిన సర్పంచ్‌ల పదవీకాలం
- ఊరికో స్పెషల్ ఆఫీసర్
- నియమించిన కలెక్టర్ అనురాగ్ జయంతి
- గ్రామపంచాయతీ పాలకవర్గాలకు వీడ్కోలు సన్మానం



బాపుసాయిపేట సర్పంచ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

సిరిసిల్ల: జిల్లా వ్యాప్తంగా అన్ని పల్లెల్లో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో పంచాయతీ పాలన సాగనుంది. గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీకాలం గురువారంతో ముగిసిపోయింది. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలు జారీచేశారు. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల పదవీకాలం ముగియడంతో ఆయా గ్రామాల్లో పాలకవర్గాలకు గురువారం వీడ్కోలు సమావేశాలు నిర్వహించారు. ఐదేళ్ల పదవీకాలంలో చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేసుకున్నారు.

నేడు చార్జి తీసుకోనున్న ప్రత్యేకాధికారులు

మళ్లీ గ్రామపంచాయతీ పాలకవర్గాల ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో గ్రామపంచాయతీ పాలన సాగనుంది. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 255 గ్రామాలు, 2,422 వార్డులు ఉన్నాయి. ప్రత్యేకాధికారులుగా మేజర్ గ్రామ పంచాయతీలకు తహసీల్దార్, ఎంపీడీవో, డీఈఈలను, ఎక్కువ జనాభా ఉన్న పెద్ద గ్రామాలకు ఎంపీవో, డిప్యూటీ తహసీల్దార్‌ను, మిగతా గ్రామాలకు మండల పరిధిలోని వ్యవసాయాధికారులు, పశువైద్యాధికారులు, అసిస్టెంట్ ఇంజినీర్లు, ఏఈవోలు, సీనియర్ అసిస్టెంట్ క్యాడర్ అధికారులు, హెల్త్ అసిస్టెంట్లను ప్రత్యేకాధికారులుగా నియమించారు. అత్యవసర సేవలు అందించే పీహెచ్‌సీ డాక్టర్లు మినహా మిగతా బాధ్యత గల అధికారులను గ్రామాకి ఒక్కరి ప్రత్యేకాధికారిని నియమించారు. వీరంతా శుక్రవారం ఆయా గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్లుగా చార్జి తీసుకోనున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులతో కలిపి ప్రత్యేకాధికారులకు జాయింట్ చెక్‌పవర్ అధికారం కల్పించనున్నారు. ఇద్దరి పర్యవేక్షణలో గ్రామపంచాయతీ పాలన, నిర్వహణ సాగనుంది. ఈమేరకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.

పాలకవర్గాలకు సన్మానాలు

జిల్లాలోని పలు గ్రామాల్లో గురువారం గ్రామపంచాయతీల పాలకవర్గాలకు ఆత్మీయ సన్మానాలు చేశారు. సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను స్థానికులు సన్మానించారు. ఐదేళ్లుగా గ్రామాభివృద్ధికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గాలకు వీడ్కోలు చెప్పారు.



ఝుమ్మంది నాదం

వేములవాడ: రాజన్న సన్నిధిలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా గురువారం నృత్య నివేదన గావించారు. చిన్నారుల నృత్య ప్రదర్శన సభికులను అలరించింది.

కేసీఆర్ పాలనలోనే పల్లెలు అభివృద్ధి



మహిళా సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



అంగన్‌వాడి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్, జెడ్పీటీసీ, ఎంపీపీలు

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం

చందుర్తి(వేములవాడ): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలోనే పల్లెలు అభివృద్ధి చెందాయని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డ, మూడపల్లి, సనుగుల గ్రామాల్లో పల్లె దవాఖానాలతోపాటు అంగన్‌వాడి కేంద్రం, మన ఊరు–మన బడిలో భోజనశాలలు, మర్రిగడ్డలో రైతు వేదికను గురువారం ప్రారంభించారు. అరుణ మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తాచెదరం లేకుండా జీపీలకు ట్రాక్టర్‌లను అందజేసినట్లు తెలిపారు. ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు వస్తుందన్నారు. జెడ్పీటీసీ నాగం కుమార్, ఎంపీపీ బైరగోని లావణ్య, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, చందుర్తి సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ పని తీరుకు నిదర్శనం

వేములవాడరూరల్: గత ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమే ఈ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవమని జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ పేర్కొన్నారు. వేములవాడ రూరల్ మండలం నూకలమర్రిలో హెల్త్‌సబ్ సెంటర్, స్కూల్‌లో డైనింగ్‌హాల్, ఓపెన్‌జిమ్, మహిళా సంఘ భవనాలను ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఈ పనులను ఈరోజు ప్రారంభించుకుంటున్నట్లు తెలిపారు. ఎంపీపీ బండ మల్లేశంయాదవ్, జెడ్పీటీసీ ఏశ వాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నాం

కోనరావుపేట(వేములవాడ): ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం ధర్మారంలో రూ.25 లక్షలతో నిర్మించిన డైనింగ్‌హాల్, అదనపు గది, గ్రంథాలయం భవనాన్ని ప్రారంభించారు. ఎంపీపీ చంద్రయ్య, సర్పంచ్ గున్నాల అరుణ, ఏఎస్‌డబ్ల్యూవో విజయలక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, వార్డెన్లు శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ బొడ్డు చంద్రయ్య, గంగుల ప్రశాంత్, గున్నాల లక్ష్మణ్ పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు

వేములవాడఅర్బన్: గత ప్రభుత్వంలోనే ఎన్నో సంక్షేమ పథకాలు అమలయ్యాయని జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ పేర్కొన్నారు. వేములవాడ మండలం అనుపురంలోని మహిళా సంఘం భవనం, మినీఫంక్షన్ హాల్ నిర్మాణానికి, కూరగాయల మార్కెట్ నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. పల్లెప్రగతి, హరితహారం, వైకుంఠధామాలు.. ఇలా గ్రామాల్లో అభివృద్ధి పనులకు పెద్దపీట వేసినట్లు తెలిపారు. ఎంపీపీ బూర వజ్రమ్మ, జెడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, వైస్‌ఎంపీపీ రవిచందర్‌రావు, సర్పంచ్ కొండపల్లి వెంకటరమణారావు, ఎంపీటీసీ రాజశేఖర్, ఆగయ్య, బూర బాబు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక


అమర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఈనెల 10 నుంచి 12 వరకు భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అమర్ ఎంపికయ్యాడు. గత నెల 31న సిరిసిల్లలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్–12 విభాగం లాంగ్‌జంప్‌లో అమర్ ప్రథమ బహుమతి సాధించాడు. అమర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు అభినందించారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని సద్దిమద్దుల సంఘం పక్కనే ఉన్న శ్రీఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. హుండీని పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. గమనించిన భక్తులు సద్దిమద్దుల సంఘం అధ్యక్షుడు వంగ బాల్‌రెడ్డికి సమాచారం ఇవ్వగా.. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆలయాన్ని పరిశీలించారు.

అప్పులబాధతో ఒకరి ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అప్పుల బాధతో మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన సంబు భీరయ్య(60) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. భీరయ్య ఏడాది క్రితం ఇంటి నిర్మాణానికి అప్పులు చేశాడు. భీరయ్య చిన్నకొడుకు ఇటీవల గల్ఫ్ దేశం వెళ్లగా అక్కడ సరైన ఉపాధి లేక ఇంటికి తిరిగొచ్చాడు. కుటుంబ పోషణకు డబ్బులు సరిపోకపోవడం, వ్యవసాయం సైతం సహకరించకపోవడంతో అప్పులు తీర్చే మార్గం కనిపించడం లేదని భీరయ్య పలుమార్లు ఆవేదన చెందేవాడని తెలిపారు. బుధవారం కుటుంబ సభ్యులు పని మీద బయటకు వెళ్లి సాయంత్రం వచ్చి చూడగా భీరయ్య ఉరివేసుకొని మృతిచెంది కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఎస్సై రమాకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రంగినేని ట్రస్ట్‌లో ఉచిత విద్యకు ప్రవేశాలు

- ట్రస్ట్ వ్యవస్థాపకుడు రంగినేని మోహన్‌రావు

సిరిసిల్ల: జిల్లా కేంద్రం శివారులోని రంగినేని సుజాత మోహన్‌రావు ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు రంగినేని మోహన్‌రావు గురువారం తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో ఉచిత విద్యకు దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. 2024–2025 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు ఫిబ్రవరి 20లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో 25, 7వ తరగతిలో 11, 8వ తరగతిలో 12, 9వ తరగతిలో 7, 10వ తరగతిలో 14 సీట్లు ఉన్నట్లు వివరించారు. మార్చిలో ప్రవేశ పరీక్షలు నిర్వహించి అర్హత సాధించిన వారికి సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. వివరాలకు 92906 87853, 98490 12459, 94907 33232 నంబర్లలో సంప్రదించాలని స్కూల్ ప్రధానోపాధ్యాయులు గాజుల ప్రతాప్, తూడి వెంకట్‌రావు కోరారు.

కాస్మోటిక్ చార్జీలు ఏమాయే ?

- కేజీబీవీల్లో నిలిచిన ఆరోగ్య కిట్ల పంపిణీ
- నెలకు రూ.100 ఇస్తామన్న అధికారులు
- ఇప్పటికీ బ్యాంక్ ఖాతాల్లో జమకాని వైనం
- ఇబ్బందులు పడుతున్న బాలికలు


గంభీరావుపేటలోని కేజీబీవీ

గంభీరావుపేట(సిరిసిల్ల): నిరుపేద బాలికల కోసం ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లోని విద్యార్థులకు కాస్మోటిక్ కిట్లు అందడం లేదు. కరోనాకు ముందు ప్రభుత్వం కిట్లు పంపిణీ చేసింది. అప్పటి నుంచి కిట్ల పంపిణీ విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో పేద విద్యార్థులపై ఆర్థిక భారం పడుతోంది. ఈ విద్యాసంవత్సరంలో కిట్లకు బదులు నెలకు రూ.100 చొప్పున చెల్లిస్తామని సమగ్ర శిక్ష అధికారులు స్పష్టం చేశారు. విద్యా సంవత్సరం ముగుస్తున్నా ఇప్పటి వరకు చార్జీలు చెల్లించలేదు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కేజీబీవీ విద్యార్థినుల కష్టాలను గుర్తించి కాస్మోటిక్ కిట్లుగాని, నెల చొప్పున రూ.100 చెల్లించాలని కోరుతున్నారు.

జిల్లాలో 6 కేజీబీవీలు

రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఆరు కేజీబీవీల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బాలికలు చదువుకుంటున్నారు. వీరికి బోధనతోపాటు వసతి కూడా కల్పిస్తున్నారు. గతంలో బాలికల వ్యక్తిగత ఆరోగ్య పరిశుభ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రతి మూడు నెలలకోసారి 15 రకాల వస్తువులతో కూడిన ఆరోగ్య కిట్లను పంపిణీ చేసింది. కరోనా రావడం, పాఠశాలలు మూతపడడంతో కిట్ల పంపిణీ నిలిచిపోయింది. కోవిడ్ తర్వాత పాఠశాలలు పునర్ ప్రారంభమయ్యాక కాస్మోటిక్ చార్జీలు చెల్లిస్తామని విద్యార్థులతో అధికారులు బ్యాంకు ఖాతాలు తెరిపించారు. కానీ ఇప్పటి వరకు డబ్బులు జమకాలేదు. పేదలు, కూలీలు, ఆర్థిక స్తోమత లేని కుటుంబాలకు చెందిన పిల్లలే ఎక్కువగా కేజీబీవీల్లో చదువుకుంటున్నారు. వీరి అవసరాల కోసం ప్రభుత్వం అందించే కాస్మోటిక్ చార్జీలు ఎంతగానో దోహదపడతాయి. కానీ ప్రభుత్వం కిట్లు పంపిణీ చేయకపోవడంతో విద్యార్థులే ఇంటి నుంచి సామగ్రి తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు కిట్లు పంపిణీ చేయాలని విద్యార్థినులు కోరుతున్నారు.

చార్జీలు చెల్లించాలి



ప్రభుత్వం కేజీబీవీల్లోని పేద విద్యార్థుల అవసరాలను గుర్తించి కాస్మోటిక్ చార్జీలను చెల్లించాలి. ప్రస్తుతం వస్తువులను ఇంటి నుంచే తెచ్చుకుంటున్నాం. మాకు ఆర్థికంగా కష్టమవుతోంది. కొత్తగా వచ్చిన ప్రభుత్వం పేద విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కాస్మోటిక్ చార్జీలు గాని, కిట్లు గాని పంపిణీ చేయాలి. – లత, పదోతరగతి విద్యార్థిని, గంభీరావుపేట కేజీబీవీ

ఉన్నతాధికారులకు నివేదించాం



కేజీబీవీ విద్యార్థులకు రెండు, మూడేళ్లుగా ఆరోగ్య కిట్లు సరఫరా కావడం లేదు. కాస్మోటిక్ చార్జీలు చెల్లిస్తామన్నారు. కానీ నిధులు విడుదల కాలేదు. ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే విద్యార్థుల ఖాతాల్లో జమచేసేలా చర్యలు తీసుకుంటాం. – రమేశ్‌కుమార్, జిల్లా విద్యాధికారి

సోషల్ టాలెంట్‌టెస్ట్‌లో ప్రతిభ

- జిల్లా స్థాయికి ఎంపిక


ప్రశంసాపత్రం అందిస్తున్న నిర్వాహకులు


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న డీఈవో

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఇంగ్లిష్ మీడియం నుంచి ఎ.శ్రీనిధి(వెంకటాపూర్), ఆర్.అభిషేక్(దుమాల) ప్రథమ, ద్వితీయ స్థానం సాధించారు. తెలుగు మీడియం నుంచి ఎస్.సాయిశ్రీజ, ఎ.అమూల్య(రాచర్ల తిమ్మాపూర్) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. రెసిడెన్షియల్ విభాగం నుంచి కేజీబీవీ అల్మాస్‌పూర్ విద్యార్థిని బి.సంధ్య ప్రథమ స్థానం సాధించింది. మండల స్థాయిలో ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను జెడ్పీహెచ్ఎస్ గొల్లపల్లి ప్రధానోపాధ్యాయుడు పాక మురళి అభినందించారు. కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట(సిరిసిల్ల): సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో నాగంపేట హైస్కూల్‌లో నిర్వహించిన మండలస్థాయి టాలెంట్ టెస్ట్‌లో 36 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో నవనీత్‌కుమార్(ముచ్చర్ల), విగ్నేశ్(లింగన్నపేట) ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. శ్రీనిక(మల్లారెడ్డిపేట), శశాంక్(కొత్తపల్లి) ద్వితీయ స్థానంలో నిలిచారు. మోడల్‌స్కూల్, రెసిడెన్షియల్ విభాగంలో వైష్ణవి, స్పందన(దమ్మన్నపేట), తెలుగు మీడియంలో సంజన(సముద్రలింగాపూర్) జిల్లాస్థాయికి ఎంపికయ్యారు.

‘పది’లో మెరుగైన ఫలితాలు సాధించాలి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ సమయాన్ని సద్వినియోగం చేసుకుని పదోతరగతి పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ సూచించారు. తంగళ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో గురువారం నిర్వహించిన సోషల్ స్టడీస్ ఫోరమ్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. జెడ్పీ కేటగిరీలో సజ్జనం దేవలక్ష్మి(ఒబులాపూర్, ప్రథమ), ఎండీ జుమేర్(జిల్లెల్ల, ద్వితీయ), రెసిడెన్షియల్‌లో జి.శృతి(పద్మనగర్ కేజీబీవీ), ఎం.సంతోష్(టీఎస్ఎంఎస్ మండేపల్లి), తెలుగు మీడియంలో పి.మల్లేశ్(జిల్లెల్ల) ఎంపికయ్యారు. ఎంఈవో దూస రఘుపతి, ఎస్వో పాసికంటి సతీష్, హెచ్ఎంలు శంకర్, నారాయణ, సోషల్ టాలెంట్ టెస్టు ఇన్‌చార్జి గుండెల్లి రవీందర్, సజ్జనం శ్రీనివాస్, రఘుపతి, బూట్ల శ్రీనివాస్, నరసింహారెడ్డి, రమాదేవి, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో లైవ్ సర్జరీలు


ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్థో వైద్యులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లో మొట్ట మొదటిసారి నిర్వహిస్తున్న 9వ తెలంగాణ రాష్ట్ర ఆర్థోపెడిక్ వైద్యుల సదస్సు గురువారం వీ–కన్వెన్షన్‌లో ప్రారంభమైంది. సదస్సుకు రాష్ట్ర నలుమూలల నుంచి ఆర్థో వైద్యులు హాజరయ్యారు. మొదటి రోజు కరీంనగర్‌లోని నాలుగు ఆస్పత్రుల్లో లైవ్ సర్జరీలు నిర్వహించగా, సదస్సుకు హాజరైన వైద్యులు వీక్షించారు. రెనే హాస్పిటల్‌లో ఆర్థోస్కోపీ–టోటల్ హిప్ రీప్లేస్మెంట్ సర్జరీని డాక్టర్ బంగారిస్వామి, చల్మెడ ఆనందరావు వైద్య కళాశాలలో ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ డాక్టర్ కేతన్ దేశ్‌పాండే, ప్రతిమ వైద్య కళాశాలలో రోబోటిక్ ద్వారా మోకాలు కీలు మార్పిడి విధానం డాక్టర్ మోతీలాల్, హోటల్ శ్వేత కాన్ఫరెన్స్ హాల్‌లో పెల్విఎసిటాబులం సర్జరీ డాక్టర్ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్ని ప్రాంతాల నుంచి లైవ్ కవరేజీ చేపట్టి వైద్యులు, పీజీ విద్యార్థులు వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ టి.కరుణాకర్‌రావు, రజనీ ఫెర్టిలిటీ సెంటర్ ఫౌండర్ బంగారి రజనీ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

రేపు చెకుముకి జిల్లా స్థాయి టాలెంట్ పరీక్ష

సిరిసిల్లఎడ్యుకేషన్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 3న జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంపతి రమేశ్ గురువారం తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో పాల్గొనేందుకు అర్హులని వెల్లడించారు. పాఠశాల, మండలస్థాయి పోటీలను నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ పోటీలు సిరిసిల్ల సినారె కళామందిరంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

దాడి కేసులో ఇద్దరికి జైలు

సిరిసిల్లకల్చరల్: ఒకరిపై దాడి చేసిన కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు, రూ.10వేల జరిమానా విధిస్తూ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పు వెలువరించారు. పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన రాగుల రాములు కుటుంబంపై అదే ప్రాంతానికి చెందిన సిరిగిరి అనిల్, మేకల కమలాకర్, సిరిగిరి యాదగిరి, ప్రమీల 2013 నవంబర్ 17న కట్టెలతో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన రాములు ఫిర్యాదుతో పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణ సమయంలో యాదగిరి, ప్రమీల మరణించారు. పూర్వాపరాల పరిశీలన అనంతరం అనిల్, కమలాకర్‌లకు మూడేళ్ల జైలు, ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

పరీక్షకు గంట ముందు రావాలి

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 4న నిర్వహించే పరీక్షకు అభ్యర్థులు కనీసం గంట ముందు కేంద్రాల్లో రిపోర్ట్ చేయాలని ఆ సంస్థ జిల్లా సమన్వయ అధికారి జాక్వెలిన్ తెలిపారు. సంబంధిత వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసిన హాల్‌టిక్కెట్లతో ఉదయం 9 గంటల్లోకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

సమ్మెను జయప్రదం చేద్దాం

సిరిసిల్లకల్చరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న చేపట్టే భారత్‌బంద్‌ను జయప్రదం చేస్తామని జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ జిల్లా శాఖ స్పష్టం చేసింది. ఈమేరకు జిల్లా కలెక్టర్ అనురాగ్‌జయంతికి రాత పూర్వకంగా తెలియజేశారు. రాష్ట్ర కార్మిక సంఘానికి అనుబంధంగా ఉన్న తమ యూనియన్ బంద్‌కు మద్దతు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉత్కంఠగా పోలీస్ క్రికెట్ పోటీలు




విజేత డీజీ బ్రేవ్ సోల్జర్స్ టీమ్‌కు కప్ అందిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్, రన్నరప్ స్ట్రైకర్స్ జట్టు

- గెలుపొందిన డీజీ బ్రేవ్ సోల్జర్స్
- క్రీడలతో నూతనోత్సాహం
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: జిల్లాలోని పోలీసులకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు గురువారం ఉత్కంఠభరితంగా సాగాయి. ఫైనల్ మ్యాచ్‌లో డీజీ బ్రేవ్ సోల్జర్స్, సిరిసిల్ల స్ట్రైకర్స్ తలపడ్డాయి. ఉత్కంఠ సాగిన ఫైనల్ పోరులో డీజీ బ్రేవ్ సోల్జర్స్ గెలుపొందింది. విజేత జట్టుకు ఎస్పీ అఖిల్ మహాజన్ బహుమతులు అందించారు. శాంతిభద్రతల పరిరక్షణలో బిజీగా ఉండే పోలీసులు క్రీడాపోటీల్లో పాల్గొనడంతో నూతన ఉత్సాహం కలుగుతుందన్నారు. పోలీసు ఉద్యోగంలో ఉన్న ప్రతి ఒక్కరు వ్యాయామాన్ని దినచర్యగా మార్చుకోవాలని సూచించారు.

టాస్‌తో తేలిన విజేత

ఫైనల్స్‌లో డీజీ బ్రేవ్ సోల్జర్స్ బ్యాటింగ్ చేసి 12 ఓవర్లలో 74 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన సిరిసిల్ల స్ట్రైకర్స్ 12 ఓవర్లలో 74 పరుగులు చేయగా మ్యాచ్ డ్రా అయ్యింది. విజేతను తేల్చేందుకు సూపర్ ఓవర్ వేయగా డీజీ బ్రేవ్ సోల్జర్స్ 14 పరుగులు చేయగా, మళ్లీ సిరిసిల్ల స్ట్రైకర్స్ 14 పరుగులు చేయడంతో ఇక టాస్ వేసి విజేతగా డీజీ బ్రేవ్ సోల్జర్స్‌ను ప్రకటించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందిందించారు. అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐలు రఘుపతి, అనిల్‌కుమార్, శశిధర్‌రెడ్డి, ఆర్ఐలు మధుకర్, యాదగిరి, రమేశ్, ఎస్సైలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజల పక్షమే..



సిరిసిల్లకల్చరల్/సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షానే ఉంటుందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. అధికారం చేపట్టిన రెండు నెలల్లోపే జిల్లా పురోగతికి రూ.40 కోట్లు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు మాటలతో ప్రజలను మభ్యపెట్టి పబ్బం గడుపుకున్నారని విమర్శించారు. మహిళా కాంగ్రెస్ పట్టణాధ్యక్షురాలు వెల్ముల స్వరూప, మాజీ కౌన్సిలర్ మడుపు శ్రీదేవి, ఆడెపు చంద్రకళ, కోడం అరుణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు రమాదేవి, సరిత, రోజా, స్వప్న, బూట్ల లత, జయలక్ష్మి పాల్గొన్నారు.

బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

కరీంనగర్: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పక్షం భేష్ అంటుంటే.. విపక్షాలు పెదవి విరిచాయి. ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రూపొందించిన బడ్జెట్ అని అధికార పక్షం అంటుండగా.. బహుళజాతి సంస్థలు, సంపన్నవర్గాలకు కొమ్ముకాసే బడ్జెట్ అని విపక్ష పార్టీలకు చెందిన పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు.

ఉద్యోగులకు తీవ్ర నష్టం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగులకు పూర్తిగా నిరాశజనకంగా ఉంది. కొత్త, పాత ఆదాయపు పన్ను అంశాల్లో ఏ విధానంలో చూసినా ప్రభుత్వ ఉద్దేశం పన్ను వసూలు చేయడం అనేది స్పష్టంగా కనిపిస్తుంది. ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని పెంచాలి. టాక్సిబుల్ ఇన్‌కంను రూ.7 లక్షల నుంచి 10 లక్షలకు పెంచాలి. స్లాబులు కూడా 5శాతం నుంచి ఉండాలి. కానీ ఏకంగా 15 నుంచి 20శాతం విధిస్తున్నారు. గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వంలో ఏనాడు ఉద్యోగులకు ఇన్‌కం ట్యాక్స్ విధానంలో లాభం జరగలేదు.
– ఊకంటి విజయేందర్‌రెడ్డి, ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు

నిరాశపర్చింది..



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశపర్చింది. రూ.3 లక్షల కోట్లు బడ్జెట్ పెంచి చూపించినా రూ.11 లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకు చూపడం దేశ ఆర్థిక పరిస్థితికి నిదర్శనంగా కనిపిస్తుంది. దేశవ్యాప్తంగా కూడు, గూడు, గుడ్డ లేని కోట్లాది మంది నేటికీ ఉన్నారు. వారందరికీ కనీస సౌకర్యాలు కల్పించడంలో కేంద్రం విఫలమైంది. నూటికి 60 శాతం ఉన్న రైతాంగాన్ని విస్మరించారు. – మిల్కూరి వాసుదేవారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి

విద్యారంగాన్ని విస్మరించారు



కేంద్రం మధ్యంతర బడ్జెట్ విద్యారంగం, తెలంగాణ విద్యార్థి లోకాన్ని పూర్తిగా విస్మరించింది. విద్యారంగానికి 10శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా.. ప్రాధాన్యత నిధులు కూడా ఇవ్వలేదు. కరీంనగర్‌లో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేయాలని విభజన హామీ చట్టంలో ఉన్నా స్థానిక ఎంపీ ట్రిపుల్ ఐటీ తీసుకురావడంలో విఫలమయ్యారు. విద్యార్థులపై భారంగా ఉన్న స్టేషనరీపై జీఎస్టీ ఎత్తివేయకుండా, నిరుద్యోగ యువత ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఈ బడ్జెట్ ఉంది.
– కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రగతిపథంలో నడిపించేది..



పేదలు, రైతు సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారు. సోలార్ ఎనర్జీని సబ్సిడీల ద్వారా ప్రోత్సహించి ప్రతి కుటుంబానికి కరెంట్ బిల్లుల నుంచి ఉపశమనం కల్పించే బడ్జెట్. దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతను ఇచ్చి బడ్జెట్ రూపొందించడం అభినందనీయం.
– పి.సుగుణాకర్‌రావు, బీజేపీ సీనియర్ నాయకుడు

అన్నివర్గాలకు మేలు చేసేలా..



మోదీ ప్రభుత్వం సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ లక్ష్యంగా పేదలకు ఇళ్ల నిర్మాణం, రక్షణ, ఉపరితల రవాణా, జాతీయ రహదారులు, రైల్వే, ఆహార ప్రజాపంపిణీ, హోంశాఖ, గ్రామీణాభివృద్ధి, ఎరువులు, రైతుసంక్షేమం, ఆయుష్మాన్ భారత్‌కు పెద్దపీట వేయడం శుభపరిణామం. – గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఇన్‌కంటాక్స్‌లో మార్పులు లేవు



2024–25 సంవత్సరానికి ఇన్‌కం టాక్స్‌లో ఎలాంటి మార్పులు లేవు. ఆదాయ పన్ను స్లాబ్‌ల ప్రకారం రూ.7 లక్షల వరకు కొత్త రిజిన్‌లో సెక్షన్ 87 ఏ ప్రకారం మినహాయింపు ఉంది. పాత టేబుల్ ప్రకారం రూ.5 లక్షల వరకు సెక్షన్ 87ఏ ప్రకారం కార్పొరేట్ పనుల్లో కొంత శాతం తగ్గించడం జరిగింది. సోలార్ పవర్‌ను ప్రోత్సహించడం కొంతవరకు హర్షించదగ్గ విషయం.
– కె.వెంకటేశ్వర్లు, అడ్వొకేట్

పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో..



వ్యవసాయరంగ పురోభివృద్ధికి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ బడ్జెట్‌లో రూ.1.27 లక్షల కోట్లు కేటాయించారు. పాడి పరిశ్రమ అభివృద్ధి కి రూ.7,105 కోట్లు. ఆహారశుద్ధి పరిశ్రమలకు రూ.3,290 కోట్ల కేటాయింపు, ఎరువుల ఖర్చు రూ.3 వేల నుంచి రూ.600 తగ్గించేలా సంప్రదాయ ఎరువుల స్థానంలో నానో డీఏపీని విస్తరించడం, నూనెగింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడం వంటి చర్యలు వ్యవసాయ అభివృద్ధికి ఊతమిస్తాయి.
– డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, తెలంగాణ ఎకనామిక్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఇన్‌కంటాక్స్ స్లాబ్ పెంచాలి



కోల్‌సిటీ(రామగుండం): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఇన్‌కంటాక్స్ స్లాబ్ పెంచాలి. రైల్వేకు గతంలో మాదిరిగా ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేయాలి. ఖాళీలను భర్తీ చేయాలి. మహిళా లోకో పైలట్స్‌కు రైలింజన్‌లో టాయిలెట్స్, ఏసీలు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలి.
– అజ్మీరా వీరన్ననాయక్, రామగుండం బ్రాంచ్ సెక్రెటరీ, దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్

ఎటువంటి మార్పు లేదు



కోల్‌సిటీ(రామగుండం): ఆదాయ పన్ను చెల్లింపుదారులను బడ్జెట్ నిరాశపరిచింది. గత ఏడాది ప్రకారమే పన్నులు ఉన్నాయి. ఎలాంటి మార్పులు చేయలేదు. బహుళ సెక్షన్ల రాయితీని అనుమతించే పాత పన్ను విధానంలో ఈ బడ్జెట్‌లో ఎటువంటి మార్పు లేదు.
– ఎం.వెంకటేశం, ఇన్‌కంట్యాక్స్ ప్రాక్టీషినర్, గోదావరిఖని

యథాతథంగా స్లాబ్‌లు



సిరిసిల్లకల్చరల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదాయపు పన్ను పరిమితిని ఈసారైనా పెంచుతారని ఆశించారు. వేతన జీవులకు ఈ విషయంలో నిరాశే మిగిలింది. పన్ను పరిమితిని పెంచాలని ఎన్నో ఏళ్లుగా ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఆదాయపు పన్ను స్లాబ్‌లు యథాతథంగా ఉంచుతున్నట్లు ఆర్థికమంత్రి ప్రకటించారు. ఇది వేతన జీవులకు తీవ్ర నిరాశ కలిగించింది. – పాకాల శంకర్‌గౌడ్, టీఎస్‌యూటీఎస్ అధ్యక్షుడు

విద్యకు కేటాయింపులు సరిపోవు



సిరిసిల్లకల్చరల్: బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించింది ఏ మాత్రం సరిపోదు. మొత్తం బడ్జెట్‌లో 2.61 శాతం మాత్రమే కేటాయించడం విద్యారంగ ప్రమాణాలు మెరుగుపరచదు. నినాదాలు, ఉపన్యాసాలతో ప్రామాణిక విద్య సాధ్యం కాదు. నిధుల కొరతతో కొత్త సంస్థల స్థాపన వీలుకాదు. మరిన్ని విద్యావకాశాలు పెంచేలా కేటాయింపులు ఉండాలి.
– దోర్నాల భూపాల్‌రెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఏ మార్పు చేయలేదు



సిరిసిల్లటౌన్: ఐటీ తదితర పన్నుల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. ఇది సామాన్యులపై ఎలాంటి ప్రభావం చూపదు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, దేశ భద్రత, దేశీయ టూరిజానికి ప్రాధాన్యత ఇచ్చారు. కమ్యూనికేషన్స్ వ్యవస్థ, టెంపుల్ టౌన్స్ అభివృద్ధికి నిధులు కేటాయించడం ఆహ్వానించదగిన అంశం.
– జిందం రమేశ్, ట్యాక్స్ కన్సల్టెంట్, సిరిసిల్ల

అనుకూల అంశాలను చేర్చాలి



సిరిసిల్లటౌన్: ఆదాయ పన్ను స్లాబుల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. పన్నుల మినహాయింపుల అంశంలో మధ్య తరగతి ఉద్యోగుల ఆశలు అడియాసలయ్యాయి. జనరల్ బడ్జెట్‌లోనైనా ఉద్యోగులకు అనుకూల అంశాలను చేర్చాలి. – మిట్టపల్లి ప్రశాంత్‌కుమార్, టీఎస్‌పీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి

టెక్స్‌టైల్ రంగానికి నిధులేవి ?



సిరిసిల్లటౌన్: దేశంలో వ్యవసాయం తర్వాత అతిపెద్ద రంగమైన టెక్స్‌టైల్‌కు నిరాశ కలిగించిన బడ్జెట్ ఇది. వస్త్రోత్పత్తి ఖిల్లా సిరిసిల్లకు మెగా పవర్‌లూం క్లస్టర్ కేటాయిస్తారన్న కార్మికుల ఆశలు గల్లంతు చేశారు. పరిశ్రమ సంక్షోభం నుంచి గట్టెక్కే అంశాలు ఏమాత్రం లేవు. కార్మికులు, శ్రమజీవులకు ప్రాధాన్యత లేదు. – కోడం రమణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి